క్లుప్తంగా

బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి

అంబర్‌పేట: పోలింగ్ బూత్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం గోల్నాక కలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పోలింగ్ బూత్‌స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందేలా కృషి చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారుడిని కలిసి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతివ్వాలని ప్రజలను కోరాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు సూచించారు. బూత్‌స్థాయిలో ప్రతి ఓటర్‌ను కలవాలని ఆయన పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలకు వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రావులపాటి మోజెస్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని దాయార మార్కెట్ నుంచి హరినగర్‌లోని వైట్ హౌజ్ హోటల్ వరకు నూతన తాగునీటి పైపు లైన్ పనులను ఇటీవల ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఆ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ జల మండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. బీఆర్‌ఎస్ నాయకులు సునీల్, శ్రావణ్, వెంకటేష్, మోయిస్, కాశీనాథ్ తదితరులున్నారు.

అభినందన



కాచిగూడ: హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) డి.వడ్డన్న కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. శుక్రవారం కళాశాల అడ్మిషన్ల ప్రక్రియ తీరు, గత విద్యా సంవత్సరం పరీక్ష ఫలితాలను ఆయన సమీక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ర్యాంకులో హెచ్ ఈసీలో 500 మార్కులకు 489 మార్కులు సాధించిన విద్యార్థి అభ్యుదయ సుధాను ఆయన అభినందించి సత్కరించారు.

కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్

ముషీరాబాద్: రాహుల్‌గాంధీపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా అనర్హత వేటు వేసిన గుజరాత్ కోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నారాయణగూడ భూలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రాహుల్‌గాంధీ ఏ తప్పు చేయలేదని గుజరాత్ కోర్టు ఎలాంటి కారణం లేకుండా శిక్ష వేయడం సరికాదన్నారు'. కాంగ్రెస్ నాయకులు వై.శ్రీనివాస్, రాజు, రాములు, సాయి, ఆనంద్, రఘురామ్, రాజేష్, మధు తదితరులున్నారు.

జనగణనలో బీసీ కులగణన చేపట్టాలి



ప్రధాని నరేంద్రమోదీతో గుజ్జ కృష్ణ

కాచిగూడ: దేశ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, జనాభాకనుగుణంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ప్రధాని నరేంద్ర మోదీని ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ కులవృత్తులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఈ విషయంలో ప్రధాని జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు. బీసీల సామాజిక రక్షణకు భద్రత కల్పించడానికి బీసీ యాక్ట్‌ను తీసుకురావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ స్థంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. బీసీల న్యాయమైన డిమాండ్లను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి



108 ఉద్యోగుల జేఏసీ సదస్సులో అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర ఉద్యాన విస్తరణ అధికారుల సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉద్యానశాఖలో హెచ్‌ఈఓలుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉద్యాన విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు సైదులు, ప్రధాన కార్యదర్శి బండి వేణు కుమార్‌ల ఆధ్వర్యంలో జి.రాంబాబుయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యానశాఖలో హెచ్‌ఈఓలుగా పనిచేస్తున్న వారిని కరోనాకాలంలో బడ్జెట్ లేని కారణంగా విధుల నుంచి తొలగించారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు కృషి చేయాలన్నారు. గత 15 ఏళ్లుగా ఉద్యానశాఖలో హెచ్‌ఈఓలుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ.. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలను రైతులకు వివరించామన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి, సంధ్యాజోషి, రుక్మిణి, శ్రీనివాసరెడ్డి, లింగరాజు, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగులు..

తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలనుసారం తొలగించిన 108 ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ స్టేట్ 108 ఎంప్లాయిస్ జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 108 ఉద్యోగులకు నాలుగు రోజులకు ఒక వీక్‌ఆఫ్ ఇవ్వాలని జీతాలు నిర్ణయించిన స్లాబ్‌లలో ఉద్యోగులను ఆటోమ్యాటిక్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రతి ఏటా 20 శాతం జీతాలను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 108 ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు వరప్రసాద్, మహేందర్‌రెడ్డి, సాంబయ్య, అశోక్, విజయ్, లతీఫ్, సదానందం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల రుణాలు మాఫీ చేయాలి



అభివాదం చేస్తున్న కందగట్ల భిక్షపతి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సహకార సంఘాల క్యాష్, క్రెడిట్ రుణాలను మాఫీ చేయాలని, సహకార బ్యాంకుల నుంచి, ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేయాలని ఉమ్మడి నల్గొండ జిల్లాల చేనేత సహకర సంఘాల అసోసియేషన్ అధ్యక్షుడు కందగట్ల భిక్షపతి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర చేనేత సహకర సంఘాల సమైక్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెస్కో బకాయిలు వెంటనే చెల్లించాలని, చేనేత కార్మికులకు వర్క్‌షెడ్ కంపెనీ, ఇళ్ల నిర్మాణానికి రూ. 6లక్షలు ఇవ్వాలన్నారు. చేనేత కార్మికులకు వ్యక్తిగత రుణాలు, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్, నాయకులు ప్రభాకర్‌రావు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ యాదగిరి, వేముల బాలరాజు, కూరపాటి రమేష్ పాల్గొన్నారు.

8 న 'విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం'

చిక్కడపల్లి: ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న త్యాగరాయగానసభలో 'విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు లోకం కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జంటలకు పురస్కారాల ప్రదానం జరగుతుందని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలు ప్రదానం చేస్తారని వివరించారు.

విజ్ఞానం పెంచేలా బోధనలు ఉండాలి



కార్యక్రమంలో ప్రొఫెసర్ చిన్నప్పను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాలానికి అనుగుణంగా విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఓయూ కామర్స్ హెడ్ ప్రొఫెసర్ డి.చిన్నప్ప అన్నారు. అధ్యాపకులు నూతనంగా బోధించాలన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ, పీజీ విద్యార్థులకు కెరీర్ ప్రొగ్రెస్‌పై రెండు రోజుల వర్క్‌షాప్ ముగిసింది. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ.. అధ్యాపకులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగం పొందాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్ చాలా అవసరమని తెలిపారు. ఓయూ జాయింట్ డైరెక్టర్ నాగవేణి, ప్రొఫెసర్ నజీయా సుల్తానా, ఎస్‌బీఐ మేనేజర్ వాల్మీకికుమార్, కళాశాల డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని జెడ్‌సీకి వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను మంజూరు చేసి పనుల నిర్వహణకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ.. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్(జెడ్‌సీ)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. జెడ్‌సీ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ సురేష్‌శెట్కర్, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు

ముషీరాబాద్: రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లు, లింగ బలిజలను ఓబీసీ కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ గంగారామ్ ఆహిర్‌ను కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి దినేష్ ఉపాధ్యాయ నేతృత్వంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప, పట్లోళ్ల సంగమేశ్వర్, మాజీ ఎంపీ సురేష్‌శెట్కర్, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లకు చెందిన విద్యార్థులు, యువత విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను లింగాయత్‌లు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లను 2009లో బీసీల్లో కలిపి 14 ఏళ్లు గడిచినా ఇప్పటికి కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో వీరశైవ లింగాయత్‌లను చేర్చలేదనే విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చామన్నారు.
- గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి, నేషనల్ బీసీ కమీషన్‌కు ఎన్నో విన్నపాలు చేసిన బీసీ కమీషన్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఓబీసీ జాబితాలలో చేర్చేందుకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదన్నారు. సానుకూలంగా స్పందించిన నేషనల్ బీసీ కమీషన్ చైర్మన్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.శివప్ప, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, కోశాధికారి దినేష్‌పటేల్, జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు పట్లోళ్ల శివచరణ్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు రాజప్ప, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శివకుమార్, భరత్, మధుసూదన్, డాక్టర్ విజయ్‌కుమార్, సోమ శేఖర్, విశ్వనాథ్, గణపతి చిన్‌చోలే తదితరులున్నారు.

పక్షవాతానికి ఉచిత చికిత్స

కాచిగూడ: పక్షవాతంతో బాధపడే వారికి కీళ్ల నొప్పులకు ఆధునిక పరికరాలతో ఉచితచికిత్సను కాచిగూడలోని శ్యామ్‌మందిర్‌లో అందిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న ఆదివారం నుంచి 13 ఆదివారం వరకు ఉచితవైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత సేవలతో పాటు సెంటర్‌కు రాలేని వారికి ఇంటివద్దే సేవలను అందజేస్తామన్నారు. వివరాలకు సెల్ 9949238492.

వెల్ఫేర్ అసోసియేషన్ల వద్దే ఓటరు జాబితా సవరణ

అంబర్‌పేట: ఈనెల 5, 6 తేదీల్లో ఓటరు నమోదు, సవరణకు అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జీహెచ్‌ఎంసీ సర్కిల్- 16 డీఎంసీ మారుతి దివాకర్ ప్రకటించారు. ప్రధానంగా కాలనీ అసోసియేషన్, అపార్టుమెంట్ అసోసియేషన్ల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన శుక్రవారం పేర్కొన్నారు. ఓటరు నమోదు, సవరణను అసోసియేషన్ల వద్దకే వచ్చి జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. అపార్టుమెంట్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కన్సల్టెన్సీ నిర్వాహకుల అరెస్ట్

అంబర్‌పేట: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఓ కన్సల్టెన్సీ నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం.. అంబర్‌పేట బతుకమ్మకుంటలో వెల్లంకి సాయి కిరణ్, వంశీరామ్‌లు ఓ కన్సల్టెంట్ సంస్థను నిర్వహిస్తున్నారు. వీరు నిరుద్యోగులైన అక్షయ్ కుమార్, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రణయ్‌కుమార్, కార్తిక్‌లకు కెనడాలో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.17 లక్షలు వసూలు చేశారు. వీరికి కెనడాలో ఉద్యోగం వచ్చినట్లు నకిలీ ఆఫర్ లెటర్లను చూపారు. వారు నిర్ధారించుకుని నకిలీవని తేలడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్రూం దరఖాస్తులన్నీ సర్వే చేయాలి

సీపీఎం డిమాండ్



నగర సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హుల కోసం ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ దరఖాస్తులన్నీ సర్వే చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 8న హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించాలని నగర పార్టీ విభాగం నిర్ణయించింది. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. నిరుపేదలు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయంలో నేరుగా చేసుకున్న దరఖాస్తులను సర్వే చేయకుండా వదిలేయడాన్ని తీవ్రంగా తప్పు పట్టింది. కేవలం ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిశీలించి విచారణ నిర్వహించడం సరికాదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది. నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం.దశరథ్, అంబర్‌పేట జోన్ కార్యదర్శి ఎం.మహేందర్, సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్ బాబు, సనత్‌నగర్ జోన్ కార్యదర్శి జి.నరేష్, నాంపల్లి జోన్ నాయకులు ఆర్. వెంకటేష్, జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి ఆర్. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు స్థలం కబ్జాపై ఫిర్యాదు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని ఆఫీస్ అకామిడేషన్ బిల్డింగ్‌లో గల హౌజింగ్ బోర్డు ఖాళీ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హౌజింగ్ బోర్డు ఈఈకి వినతిపత్రం సమర్పించారు. బాగ్‌లింగంపల్లిలోని ఖాళీ స్థలాలపై కన్ను వేసిన కొంతమంది రాజకీయ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం.దశరథ్, కార్యవర్గ సభ్యులు కె.రమేష్, ఏ.శ్రీరాములు తదితరులున్నారు.

పేదల అభ్యున్నతికి సేవా భారతి కృషి



పాల్గొన్న ఇన్ఫోసిస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భరద్వాజ్ తదితరులు

కాచిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సేవా భారతి చేస్తున్న కృషి ప్రశంసనీయమని 'ఇన్ఫోసిస్ అసోసియేట్' వైస్ ప్రెసిడెంట్ భరద్వాజ్ అన్నారు. కాచిగూడలోని సేవాభారతితో అనుబంధంగా ఇన్ఫోసిస్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి, సుధామూర్తిల సామాజిక సేవ ఆశయాలను నెరవేరుస్తున్నామన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సేవా భారతి నిర్వహించే కిషోరి వికాస్ యోజన, జీడీఏ ప్రోగ్రామ్ కోసం మరింత సాయాన్ని ఇన్ఫోసిస్ కంపెనీ సీఎస్‌ఆర్ ద్వారా ఆయన ప్రకటించారు. ఇన్ఫోసిస్ సీఎస్‌ఆర్ సాయాన్ని కంపెనీ ప్రతినిధులు చెక్కు ద్వారా 'సేవా భారతి'కి అందజేశారు. కోశాధికారి హరీష్ చొల్లేటి, కుల్‌దీప్ సక్సేనా, శ్రీవిద్య తదితరులున్నారు. వివరాలకు సెల్ 9398312414.

కమేలా సమస్యలు పరిష్కరించాలని వినతి



జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

కాచిగూడ: స్థానిక కమేలాలో కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కై మొండెదార్లను నిత్యం అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాచిగూడ కమేలా అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.రమేష్ ఆరోపించారు. శుక్రవారం కమేలాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సరైన వసతులు లేక మూగజీవాలు చనిపోతున్నాయని దీంతో వ్యాపారులు నష్టాలతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొండెదార్ల సమస్యలను సత్వరమే పరిష్కరించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. రోజురోజుకు కాంట్రాక్టర్, అధికారుల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రఘునాథ్, సతీష్, రైయిస్ బాయి, రాంమోహన్, ఇమ్రాన్, సోయబ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ముఖ్యమంత్రి దిశగా ఉద్యమం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక తెలంగాణలో భాగంగా బీసీ ముఖ్యమంత్రి దిశగా ఉద్యమించాలని తెలంగాణ డెమాక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్ సుదమల్ల వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరగాలని ఎన్నికల ఖర్చును కూడా ప్రభుత్వమే భరించాలని కోరారు. గెలిచిన అభ్యర్థులు ప్రజల కోసం పనిచేయని పక్షంలో వారిని రికాల్ చేసే హక్కు ఓటర్లకు కల్పిస్తామన్నారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ కె.వీరస్వామి, అంసోలు లక్ష్మణ్, మహేశ్వర్, వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు ఆర్. పాండురంగాచారి, శ్రీకాంత్‌చారి, మేకల నర్సింహ్మారెడ్డి, ఎం.అశోక్, ప్రొఫెసర్ డీ.ఎం.రవిప్రసాద్, తదితరులున్నారు.

ఆకట్టుకున్న సినీగీత విభావరి



చిక్కడపల్లి: 'మైహరా డాన్' శీర్షికతో త్యాగరాయగాన సభలో సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీగీత విభావరి ఆకట్టుకుంది. శుక్రవారం సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ 94వ జయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు, సంస్థ వ్యవస్థాపకులు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆయనతో పాటు సంస్థ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, సత్యదీప్తి, జ్యోతిర్మయి బొమ్మ, శారదరాజా, స్వప్న, రాణిరావు, అమ్మాబేగం, రాగరేఖలు గీతాలు మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా రామసుబ్రహ్మణ్యంను స్వరగానమృతరామ కిశోరం బిరుదుతో, గాయకులు శ్రీకుమార్‌నాయర్‌ను నవరసగాన కిశోర్‌కుమార్ నాయర్ బిరుదుతో సత్కరించారు. నేపథ్య గాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రముఖ సుజాత విద్యాసంస్థల చైర్మన్ జయప్రకాశ్ సింగ్, వ్యాపారవేత్త ఎల్‌పీరావులు పాల్గొన్నారు.

50 శాతం మద్యం దుకాణాలను కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

కాచిగూడ: గౌడ కులస్తులకు 50 శాతం మద్యం దుకాణాలను కేటాయించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో కోటి మంది ఉన్న గౌడ కులస్తులు కల్లుగీత, మద్యం దుకాణాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. గీత కార్మికులు మరణిస్తే రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు తాటి, ఈత వనాలను పెంచేందుకు ప్రతి గీత కార్మిక సొసైటీకి 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. శివనాగేశ్వర్‌గౌడ్, ప్రదీప్, సాంబశివ, సుధార్, నవీన్ తదితరులున్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు 18 వరకు గడువు..

ముషీరాబాద్: ఎక్సైజ్ నూతన పాలసీ ప్రకారం మద్యం షాపుల ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 29 వైన్ షాప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను సికింద్రాబాద్‌లోని జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. 21న ఉదయం 11 గంటలకు అంబర్‌పేట్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు ప్రకటించారు. దరఖాస్తులకు రూ.2 లక్షల నాన్‌రిఫండబుల్ డీడీని జత చేయాలని సూచించారు. వివరాలకు 9440902296.

నియామక పత్రాల అందజేత



నియామకపత్రాలను అందజేస్తున్న లక్ష్మణ్‌రావు

కాచిగూడ: హిందూ ధర్మరక్షణ కోసం భజరంగ్ సేన నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఆర్. లక్ష్మణ్‌రావు అన్నారు. హిందూ ధర్మం కోసం భజరంగ్ సేనలో పనిచేస్తున్న ప్రతినిధులను వివిధ హోదాల్లో నియమిస్తూ శుక్రవారం కాచిగూడలోని భజరంగ్ సేన కార్యాలయంలో ఆయన వారికి నియామక పత్రాలను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్ఎస్ అజయ్‌నాయుడు, మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌రాజ్, ప్రధానకార్యదర్శిగా కే.వీ.జగదీష్‌గౌడ్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా కె.సునిల్‌చారి, హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా అభినయ్ తివారి, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షుడిగా వినిత్‌యాదవ్‌లను నియమిస్తూ.. వారికి నియామకపత్రాలను అందజేశారు. శ్రీనివాస్‌గుప్తా, నందకిషోర్ అగర్వాల్, సూర్య శుక్లా ఠాకూర్ వికాస్‌సింగ్, మనోజ్ మొగల్‌గిద్ది, ప్రవీణ్‌యాదవ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు శుభాకాంక్షల వెల్లువ



బీజేపీ సీనియర్ నేతలు సూర్యనారాయణశర్మ తదితరులు



పట్టువస్త్రాలను అందజేస్తున్న మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి

ముషీరాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కు నియోజకవర్గ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ముషీరాబాద్ నుంచి ప్రమాణ స్వీకారానికి హాజరైన బీజేపీ సీనియర్ నేతలు సూర్యనారాయణశర్మ, సుబ్రహ్మణ్యం, శేషసాయి, సాయికృష్ణయాదవ్ తదితరులు ఢిల్లీలో బండిసంజయ్‌ను కలిశారు.

కాచిగూడ: బీజేపీ మహిళా మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పట్టువస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు జయశ్రీ, బూర నర్సయ్యగౌడ్, దేశ్‌పాండే తదితరులున్నారు.